క్లుప్తంగా

పెంచిన వంట గ్యాస్ ధర తగ్గించాలి

నిర్మల్‌చైన్‌గేట్: పెంచిన వంటగ్యాస్ ధర వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నూతన్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన నుంచి ఇంధన ధరలను నియంత్రించకుండా కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం పెంచుతూ ప్రజలపై భారం మోపుతోందని ఆరోపించారు. అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గకపోవడం దారుణమని పేర్కొన్నారు. పెంచిన ధరను వెంటనే వెనక్కి తీసుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు ఫసియొద్దీన్, పోశెట్టి, శంబు, తిరుపతి, మురళి, మజీద్, ఆనంద్‌రావు, విజయ్, సంతోష్, సోమేశ్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న సీడీపీవో సరిత

ఖానాపూర్: గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల్లో సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. బుధవారం పట్టణంలోని సుభాష్‌నగర్ -1, 2 కేంద్రాలలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసే పోషకాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు పట్టణంలోని బర్కత్‌పుర అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ వరలక్ష్మి పోషణ పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. సూపర్‌వైజర్ శ్యామల, టీచర్లు సరోజ, మమత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: గర్భిణులు, బాలింతలు పోషకాలున్న ఆహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధ అన్నారు. బుధవారం భూత్కూర్, దస్తురాబాద్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషకాహారంపై అవగాహన కల్పించారు.

ఎల్లాపి ఉద్యోగుల సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి

ఖానాపూర్: తెలంగాణలోని ఎల్లాపి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం బలోపేతానికి కృషిచేస్తానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచకొండ సత్యనారాయణరావు అన్నారు. బుధవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘభవనంలో ఏర్పాటు చేసిన జిల్లా నూతన కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. సంఘం నూతన అధ్యక్షుడిగా సీహెచ్ కిషన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గణపతిరావు, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్‌రావు, నరేందర్‌రావు, నర్సింహారావు, సాగర్‌రావు, కోశాధికారిగా బి.నర్సింహారావు, గౌరవ అధ్యక్షుడిగా గోపాల్‌రావు, న్యాయ సలహాదారులుగా వెంకటరమణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాంతారావు, పబ్లిసిటీ సెక్రటరీగా రామారావు, సహాయ కార్యదర్శులుగా రాము, రాజేశ్వర్, శేఖర్, గౌరవ సలహాదారులుగా జలపతిరావు, మోహన్‌రావు, సత్తయ్య, ఉపేందర్‌రావు తదితరులు ఎన్నికయ్యారు.

'బాధిత కుటుంబాలకు అండగా ఉంటా'

కుంటాల: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రజాట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్‌రావు పటేల్ భరోసా ఇచ్చారు. మండలంలోని ఓలా గ్రామంలో అగ్నిప్రమాదంలో వేల్పూర్ రాజశేఖర్, రాకేశ్, రంజిత్‌లకు చెందిన వడ్రంగి షెడ్లు దగ్ధమవడంతో బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తనవంతు సాయంగా మూడు షెడ్లను నిర్మించి ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం అంబుగామలోని పారిశ్రామికవేత్త సుదర్శన్ పటేల్ తల్లి లక్ష్మీబాయి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ సుభాష్‌పటేల్, నాయకులు లక్ష్మణ్ పటేల్, గుద్దేటి నర్సయ్య, రవి, రఘువీర్ తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలోని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో బుధవారం మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 12వ తేదీన జన్నారం మండల కేంద్రంలో ఎస్‌సీటీ చైర్మన్ సాయిని ప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు జన్నారం మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జాడి గంగాధర్ పేర్కొన్నారు. నాయకులు నర్సాగౌడ్, సంతోష్, ప్రభుదాస్, వెంకటేశ్, సతీశ్, వినోద్ తదితరులు ఉన్నారు.

వనమహోత్సవంపై దృష్టి


కోతల్‌గాం నర్సరీలో పెంచుతున్న మొక్కలు

- నర్సరీల్లో మొక్కల పెంపకం
- 3.50 లక్షలు నాటడమే లక్ష్యం
- రక్షణకు గ్రీన్‌షెడ్లు ఏర్పాటు

భైంసారూరల్: ప్రభుత్వం ఏటా వనమహోత్సవం పేరిట పెద్దఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా వనమహోత్సవంలో నాటే మొక్కలను ప్రతీ గ్రామంలోని నర్సరీల్లో పెంచుతున్నారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో 30 నర్సరీలు ఏర్పాటు చేశారు. నర్సరీల్లో మొక్కలు పెంచడం పైనే దృష్టిసారించిన సిబ్బంది ప్రతీరోజు వాటికి నీటిని పట్టిస్తున్నారు. ఎండవేడిమికి మొక్కలు వాడిపోకుండా నర్సరీల్లో గ్రీన్‌షెడ్లు ఏర్పాటు చేశారు. నర్సరీలపై గ్రీన్‌షెడ్లు ఏర్పాటు చేసి రోజూ నీటిని పట్టిస్తున్నారు. రోజువారీగా అధికారులు పనులు ముమ్మరం చేస్తున్నారు.

లక్ష్యం 3.50 లక్షలు

ఈసారి మండలంలో వనమహోత్సవంలో భాగంగా 3.50 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతీ నర్సరీలో 10వేల నుంచి 13వేల మొక్కలు పెంచేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మొక్కలు నాటేందుకు స్థలాల ఎంపిక కూడా జరిగింది. వర్షాలు కురవగానే మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేశారు. మొక్కలు నాటేందుకుగాను అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో, ఎంపీవో, ఈజీఎస్ అధికారులు వేర్వేరుగా పంచాయతీ సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పనులు ముమ్మరం..

పంచాయతీల్లో మొక్కలు పెంచే పనులపై అధికారులు దృష్టి పెడుతున్నారు. 30 పంచాయతీల్లోనూ ట్రాక్టర్లతో ఇప్పటికే రోడ్ల పక్కన మట్టిని తొలగిస్తున్నారు. మొక్కలు నాటే ప్రదేశాలను ఎంపిక చేశారు. ఈ ప్రదేశాల్లో ముళ్ల కంచెలు తొలగిస్తున్నారు. ఉపాధిహామీ కూలీలతో రోడ్ల పనులు పూర్తిచేస్తున్నారు. రోజువారీగా ఉదయం నుంచి రాత్రి వరకు సిబ్బంది పనులు చేపడుతున్నారు. మొక్కలు నాటే ప్రదేశాలను ఎంపిక చేసి చుట్టూ వారితో శుభ్రత పనులు చేపడుతున్నారు.

ప్రత్యేకంగా దృష్టి సారించాం

ఉపాధిహామీలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే ఎంపిక చేసిన నర్సరీల్లో పనులు జరుగుతున్నాయి. ప్రతీ నర్సరీలో గ్రీన్ షెడ్లు ఏర్పాటుచేసి మొక్కలను సంరక్షిస్తున్నాం. ఉపాధి పనులు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. వనమహోత్సవంలో పకడ్బందీగా మొక్కలు నాటించి వాటిని సంరక్షించే ఏర్పాట్లు చేస్తాం.

– శివలింగం, ఈజీఎస్ ఏపీవో

సన్న బువ్వ తిని.. ఆప్యాయంగా పలకరించి


లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు సన్నబియ్యం ఉచితంగా అందిస్తుందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మండలంలోని చింతల్‌చాంద గ్రామం ఎస్సీ కాలనీలో బుధవారం సన్నబియ్యం లబ్ధిదారులు తాండ్ర వసంత -రాజేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా సన్న బియ్యం పథకంపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గా భవాని, వ్యవసాయ కమిటీ ఉపాధ్యక్షుడు ఈటల శ్రీనివాస్, నిర్మల్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నందెడపు చిన్ను, గాజుల రవికుమార్ తదితరులు ఉన్నారు.

'తులం బంగారంపై మళ్లీ ప్రస్తావిస్తా'


కుంటాలలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కుంటాల: అసెంబ్లీ సమావేశాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.లక్ష 16వేలతో పాటు తులం బంగారం ఇప్పించాలని మళ్లీ అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. బుధవారం కుంటాల రైతువేదికలో 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేదింటి మహిళలకు వరమన్నారు. తహసీల్దార్ కమల్ సింగ్, డీటీ నరేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్యే పి రామారావు పటేల్ బుధవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. ముధోల్ మండలానికి చెందిన అనిత రూ.27వేలు, ద్రుపతిబాయి రూ.25వేలు, హరిత రూ.22,500, భైంసా మండలం మహాగాంకు చెందిన చంద్రే అమృత్ రూ.18వేలు, గంగాశేఖర్ రూ.28,500, సారిక రూ.25,500, పెండ్‌పెల్లికి చెందిన వెంకట్ రెడ్డికి రూ.18వేలు, కామోల్‌కు చెందిన దేవన్నకు రూ.10,500, బాసర మండలానికి చెందిన మల్కన్నకు రూ.28,500 విలువైన చెక్కులు అందించారు.

చెక్కులు అందజేత

ముధోల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే రామరావుపటేల్ అందజేశారు. చించాల, ఎడ్‌బిడ్, తరోడా, రాంటెక్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, వీడీసీ అధ్యక్షులు విఠల్, భూమేశ్, పోతన్న యాదవ్, నాయకులు రమేశ్, వెంకటేశ్, సాయన్న తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం..

మండల కేంద్రంలో ఈ నెల 11న మహాత్మ జ్యోతిబాపూలే -సావిత్రబాయిపూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు బుధవారం ఎమ్మెల్యే రామరావుపటేల్‌ను మహాత్మజ్యోతిబాపూలే కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

నాణ్యమైన ధాన్యం విక్రయించాలి


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మోతిరాం

లోకేశ్వరం: నాణ్యమైన వరిధాన్యాన్ని ప్రభుత్వ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించాలని తహసీల్దార్ మోతిరాం అన్నారు. బుధవారం మండలంలోని కన్కపూర్, గడ్‌చాంద, రాజూర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వరిధాన్యంలో తప్పతాలు లేకుండా చూడాలన్నారు. ఏపీఎం మల్లేశ్, సీసీలు సుకుమార్, రాజేశ్వర్, మహేందర్, రైతులు, ఐకేపీ సీఏలు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి, నందన్, బామ్ని (బి), చాక్‌పల్లి, అర్లి(కే), బూర్గుపల్లి(కే) గ్రామాల్లో డీఆర్డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎం రాజేశ్వర్, ఏపీఎం సునంద బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతుధర పొందాలని సూచించారు. సీసీలు ఈ.ముత్యం, సందేశ్, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బాసర: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శం

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు


లక్ష్మణచాందలో ర్యాలీలో పాల్గొన్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద: ఏఐసీసీ పీసీసీ పిలుపు మేరకు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని గాంధీ, అంబేడ్కర్, శివాజీ, చాకలి ఐలమ్మ, తెలంగాణ తల్లి, అమర వీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కులం, మతం, వర్ణం ఆధారంగా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, వ్యవసాయ కమిటీ ఉపాధ్యక్షుడు ఈటల శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షులు దుర్గా భవాని, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, నారాయణ, ప్రతాప్ రెడ్డి, భీమన్న, గంగాధర్, నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని కడ్తాల్, సాకెర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని బుధవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, మండల అధ్యక్షుడు మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు రాజనర్సింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మ్యాక ప్రేమ్ కుమార్, మోహినుద్దీన్, అంబేకర్ ప్రసాద్, శ్రీనివాస్, రితీష్ చారి, రమేశ్ రెడ్డి, బర్మ దాసు, రమణ, గుర్రం రాము, బర్మ శ్రీకాంత్, నవీన్, మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుందని భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ అన్నారు. మండల కేంద్రంతో పాటు అడెల్లి గ్రామంలో బుధవారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఏఎంసీ చైర్మన్ అబ్దుల్‌హాదీ, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రావు, రాజేశ్వర్, నారాయణరెడ్డి, నర్సరెడ్డి, నవీన్‌రెడ్డి ఉన్నారు.

కారుమబ్బులతో రైతుల పరేషాన్!


అందాకూర్‌లో ఆరబెట్టిన జొన్నలపై టార్పాలిన్ కప్పుతున్న రైతులు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం సాయంత్రం కారుమబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇప్పటికే మొక్కజొన్న, జొన్న పంట ఉత్పత్తులు చేతికొచ్చాయి. వాటిని కల్లాల ఎదుట ఆరబెట్టిన రైతులు అకాల వర్ష సూచనలు ఉండడంతో ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. పంటలపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచుతున్నారు. మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రైతులు కోరుతున్నారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న రాజేశ్వర్ గౌడ్

లక్ష్మణచాంద: రాజీవ యువ వికాసం పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజేశ్వర్ గౌడ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 14 వరకు గడువు ఉందన్నారు. ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఖానాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సునీత అన్నారు. బుధవారం మండలంలోని తర్లపాడ్, సత్తనపల్లి, పాత తర్లపాడ్ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకుముందు తర్లపాడ్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ సుజాతతో కలిసి సందర్శించి విద్యుత్ సమస్య పరిష్కారంపై అధికారులతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రం చుట్టూ ప్రహరీ ఏర్పాటు విషయమై కొలతలు పరిశీలించారు. ఎంపీవో రత్నాకర్ రావు, గ్రామస్తులు ఉన్నారు.

బ్యాంకింగ్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న రామ్‌గోపాల్

సారంగపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బ్యాంకింగ్ పథకాలను ఉపాధిహామీ కూలీలు, నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ సూచించారు. ఈమేరకు బుధవారం మండలంలోని బీరవెల్లి, ప్యారమూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు జరిగే ప్రదేశాలకు వెళ్లి వారికి బ్యాంకింగ్ పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలురకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీరవెల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజరు సూర్యశేఖర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్యారమూర్ శాఖ మేనేజరు శేఖర్, తదితరులు ఉన్నారు.

భైంసాలో బాలిక అపహరణ

భైంసాటౌన్: పట్టణానికి చెందిన ఓ బాలిక అపహరణకు గురైనట్లు సీఐ గోపినాథ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. సదరు బాలిక మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ గాలించినా ఆచూకీ లభించలేదు. ఓవైసీనగర్‌కు చెందిన షేక్ అబూ అనే యువకుడు తన కూతురికి మాయమాటలు చెప్పి అపహరించి ఉంటాడని తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో నుంచి రూ.2.16లక్షల నగదు, ఐదు తులాల బంగారం సైతం అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

11న తైబజార్ వేలం

ఖానాపూర్: పట్టణ పరిధిలోని వారసంతతో పాటు మార్కెట్ పరిధిలో పన్నులు వసూలు చేసేందుకు చేపట్టాల్సిన తైబజార్ కోసం ఈ నెల 11న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5గంటల లోపు వేలంలో పాల్గొనే వారు రూ.లక్ష డీడీని కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేలా చూడాలి

తానూరు: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందించేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సన్నబియ్యం రేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలన్నారు. ఎంపీడీవో నసిరోద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పృథ్వి, ఈజీఎస్ ఏపీవో శివలింగం పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలి

కడెం: హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్‌రాథోడ్, బీఆర్ఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ అన్నారు. బజరంగ్‌దళ్ మండలాధ్యక్షుడు అమరవేణి రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీలో వారు పాల్గొన్నారు. మండలంలోని పాండ్వపూర్ హనుమాన్ ఆలయం వద్ద పూజలు నిర్వహించి శ్రీరాముని, హనుమాన్ విగ్రహాలతో కాలినడకన కొండుకూర్, కన్నాపూర్, కడెం మీదుగా పెద్దూర్ హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. యాత్రలో భాగంగా నృత్యాలు, జై శ్రీరాం, జైహనుమాన్ నామస్మరణతో గ్రామాలు మార్మోగాయి. ఈసందర్భంగా నిర్వాహకులు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సతీశ్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి, నగేశ్, శ్రీరాం ఉన్నారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం ధ్వజారోహణ, గరుడపెల్లి, అగ్నిప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు రామచంద్రచార్యులు, విజయ్‌స్వామిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం శ్రీదేవిభూదేవి కల్యాణం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 11కేవీ నర్సాపూర్ (జి)టౌన్ లైన్, నర్సాపూర్ (జి)11 కేవీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు (ఏజీఎల్‌లైను) మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ డీ.శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళం

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి కేఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ కోర్వ నవీన్‌రెడ్డి రెండు క్వింటాళ్ల బియ్యం డబ్బులను అందజేశారు. నవీన్‌రెడ్డికి గ్రామస్తుల తరఫున వీడీసీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రతీఒక్కరికి ఉపాధి పని కల్పించాలి

ఖానాపూర్: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఏపీడీ నాగవర్ధన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఖానాపూర్, పెంబి మండలాల ఈజీఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు ఉన్నారు.

భూమిపూజ

మామడ: మండలంలోని రాయదారి గ్రామంలో బుధవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మంజూరైన రూ.10 లక్షల నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. బీజేపీ నాయకులు బాపురెడ్డి, వెంకటేశ్వర్‌రావు, గంగాధర్, చక్రపాణి, రంజిత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పిప్రిలో వడదెబ్బపై కళాజాత

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామంలో ఉపాధిహామీ జరిగే పనుల వద్ద బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత ప్రదర్శన ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలు ఉదయం, సాయంత్రం వేళలో పని చేసుకోవాలన్నారు. సుదర్శన్, రఘునాథ్, నాగరాజు, తస్లిమ, లక్ష్మణ్, అధికారులు ఉన్నారు.

ఆర్మీలో సేవలు అభినందనీయం

భైంసారూరల్: దేశ రక్షణ కోసం ఆర్మీలో సేవలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. దేగాం గ్రామానికి చెందిన సిందే సందీప్ పటేల్ దేశసేవ కోసం ఆర్మీలో 19 సంవత్సరాలు పనిచేసి ఉద్యోగ విరమణ పొందడం గొప్ప విషయమన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సందీప్ పటేల్‌ను బుధవారం తన నివాసంలో ఎమ్మెల్యే రామారావుపటేల్ శాలువాతో సత్కరించి, అభినందించారు. మండల బీజేపీ అధ్యక్షురాలు సుష్మారెడ్డి, నాయకులు లింగన్న, కిషన్‌పటేల్, ప్రకాశ్ ఉన్నారు.

కొండగట్టుకు పాదయాత్ర

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన హనుమాన్ దీక్షాపరులు బుధవారం ఖానాపూర్ నుంచి జగిత్యాల జిల్లా కొండగట్టులోని దేవస్థానానికి పాదయాత్రగా తరలివెళ్లారు. ముందుగా పట్టణంలోని శ్రీవీరాంజనేయ జంగల్ హనుమాన్ ఆలయంలో పండితులు రామోజుల రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రాజేందర్ గౌడ్, సత్తన్న, ప్రశాంత్, సుధాకర్‌గౌడ్, భూమేశ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల నుంచి హనుమాన్ స్వాములు కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పార్‌పెల్లి, మల్లాపూర్ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హనుమాన్ స్వాములు కాలినడకన కొండగట్టుకు బయలుదేరారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలో బుధవారం భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్రను నిర్వహించారు.

ఎస్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

బాసర: మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘం నాయకుడు జంగం శశిధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జంగం శశిధర్ మాట్లాడుతూ ఎస్ఎస్‌యూఐ విద్యార్థుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. సాయి, అఖిల్, సజ్జాద్, అర్సలాన్, మౌలా, అన్సార్, కృష్ణ, ఆత్మారాం ఉన్నారు.

అంబలి పంపిణీ కేంద్రం సందర్శన

నిర్మల్‌టౌన్: మానవ సేవయే మాధవసేవ అని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ పట్టణంలో పాకాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. అంబలిని పాకాల రాంచందర్ అందిస్తుండటం అభినందనీయమన్నారు. ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్‌శ్రీకాంత్ యాదవ్, భాస్కర్, గోవు గోపి, పాల్గొన్నారు.

వరంగల్ సభ విజయవంతం చేయాలి

నిర్మల్‌టౌన్: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోన్ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ఖానాపూర్: బీఆర్ఎస్ రజతోత్సవ సభను పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ కోరారు. బుధవారం పట్టణంలోని జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు.

ద్విచక్రవాహనదారులు జాగ్రత్తగా ఉండాలి

కడెం: బైక్ దొంగతనాలు జరుగుతున్నందున ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై ఎం. కృష్ణసాగర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బైక్‌ను తప్పనిసరిగా హ్యాండిల్‌లాక్‌తో పార్కింగ్ చేయాలని, ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.